క్లుప్తంగా

నేడు డ్రాఫ్ట్ ఓటరు జాబితాపై సమావేశం

కాటారం: స్థానిక సంస్థల-2025 ఎన్నికల నిర్వహణ పురస్కరించుకుని తయారు చేసిన డ్రాఫ్ట్ ఓటర్ లిస్టుపై అభ్యంతరాలపై నేడు(శనివారం) మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ బాబు తెలిపారు. జాతీయ, రాష్ట్ర రాజకీయ పార్టీలకు చెందిన ప్రతినిధులు హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

అభ్యంతరాలు ఉంటే తెలపాలి

మొగుళ్లపల్లి: గ్రామ పంచాయతీల్లో ప్రదర్శించిన ఓటరు జాబితాలో ఏమైనా అభ్యంతరాలు ఉంటే నేడు(శనివారం) 5 గంటలలోపు తెలియజేయాలని ఎంపీడీఓ సురేందర్ తెలిపారు.

హరితహారం చెట్ల నరికివేత

● పోలీసులకు ఫిర్యాదు

భూపాలపల్లి రూరల్: భూపాలపల్లి మండలంలోని రాంనాయక్‌తండాలో హరితహారంలో భాగంగా ఐదు సంవత్సరాల క్రితం నాటిన మొక్కలు తమకు ఇబ్బంది కలిగిస్తున్నాయని పోరిక పద్మ-ధన్ సింగ్ వారి ఇంటికి పక్కన ఉన్న చెట్లను నరికివేశారని గ్రామ కారదర్శి కృష్ణ కాంత్ శుక్రవారం తెలిపారు. దీంతో పైఅధికారులతో ఆదేశాల మేరకు ఇలాంటి సంఘటన మళ్లీ పునరావృతం కాకుండా చెట్లు నరికి వేసిన వారిపై పంచాయతీ రాజ్ చట్టం, 2018 సెక్షన్ 96 ప్రకారం చర్యలు తీసుకోవాలని ములుగు జిల్లా వెంకటపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

దరఖాస్తు చేసుకోవాలి

కాళేశ్వరం: మహదేవపూర్ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల ఖాళీగా ఉన్నటువంటి తెలుగు సీఆర్టీ పోస్ట్ కోసం తాత్కాలిక పద్ధతిలో భర్తీకి అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల స్పెషల్ ఆఫీసర్ కనకలక్ష్మీ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డిగ్రీలో తెలుగు సబ్జెక్ట్‌తో పాటు బీఈడీ, టెట్ అర్హత గల అభ్యర్థులు ఈనెల 31లోపు మహదేవపూర్ కేజీబీవీ పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 9493043767 సెల్ నంబర్‌లో సంప్రదించగలరని తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

మొగుళ్లపల్లి: మండలంలోని కొర్కిశాల మోడల్ స్కూల్‌లో ఆరో తరగతి నుంచి 10వ తరగతి వరకు, ఇంటర్మీడియేట్ మొదటి సంవత్సరం ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపుల్లో మిగిలిపోయిన సీట్లను భర్తీ చేయడానికి స్పాట్ అడ్మిషన్లను పొందవచ్చని ప్రిన్సిపాల్ తాళ్లపెల్లి రాకేశ్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 9వ తరగతి నుంచి ఇంటర్మీడియేట్ చదివే అమ్మాయిలకు హాస్టల్ వసతి ఉందని అర్హత గల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని నాణ్యమైన విద్యను పొందాలన్నారు. అలాగే కళాశాలలో కెమిస్ట్రీ సబ్జెక్ట్‌ను తాత్కాలిక పద్ధతిని బోధించుటకు బీఈడీ అర్హత ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పరామర్శ

కాటారం: మహాముత్తారం మండలం మాదారంలో బీఆర్ఎస్ నాయకుడు దాసరి వెంకటస్వామి(జంగు) మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు శుక్రవారం పరామర్శించి మృతదేహం వద్ద నివాళులర్పించారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు జక్కు రాకేశ్, మండల అధ్యక్షుడు మార్క రాముగౌడ్ తదితరులు ఉన్నారు.

ఆశలపల్లకి.. అందేదెవరికి?

● ఎంపీపీ, జెడ్పీటీసీ రిజర్వేషన్లపై ఉత్కంఠ
● కొత్త మండలంలోని స్థానాలపై ఆశావహుల చూపు
● రిజర్వేషన్లు ప్రకటించేందుకు ప్రభుత్వం కసరత్తు



మండల ప్రజా పరిషత్ కార్యాలయం

రేగొండ (కొత్తపల్లిగోరి): నూతనంగా ఏర్పడిన తర్వాత కొత్తపల్లిగోరి మండలంలో మొదటి సారి ఎన్నికలు నిర్వహించనున్నారు. మండలానికి జెడ్పీటీసీ, ఎంపీపీ స్థానాలను కేటాయిస్తారు. ఈ రెండు కూడా ప్రాధాన్యత కలిగినవే. వాటిని దక్కించుకోవడానికి పోటీ కూడా తీవ్రంగానే ఉండబోతుంది. దీని కోసం మండలానికి చెందిన రాజకీయ నాయకులు, అనుభవం ఉన్న నాయకులు, సాధారణ వ్యక్తులు, యువకులు పోటీలో ఉండడం సహజం. ప్రభుత్వం ఇంకా రిజర్వేషన్లు ఖరారు చేయలేదు. ఇటీవలే మంత్రివర్గ సమావేశం నిర్వహించారు. త్వరలోనే రాష్ట్ర వ్యాప్తంగా రిజర్వేషన్లు ప్రకటించే అవకాశం ఉంది. ఈ రెండు స్థానాలకు పోటీ చేసే ఆశావాహుల్లో ఉత్కంఠ నెలకొంది.

ఎవరికి వారే..

నూతన మండలం కావడంతో మొదటి సారిగా ఎంపీపీ, జెడ్పీటీసీ పదవులు ఎవరికీ వరించనుందో వారి పేర్లు చిరస్థాయిగా నిలిచిపోతాయి. అందు కోసం మండలంలోని అన్ని సామాజిక వర్గాలకు చెందిన నాయకులు, జిల్లా స్థాయి నాయకులతో టచ్‌లో ఉంటున్నారు. పోటీ చేయడానికి తాము సిద్ధంగానే ఉన్నట్లు సంకేతాలు ఇస్తున్నారు. ఓసీ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, అన్ని సామాజిక వర్గాలకు చెందిన బడా నాయకులు ఆర్థికంగా బలంగానే ఉన్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఏ సామాజిక వర్గానికి రిజర్వేషన్ వరించిన ఆయా వర్గాలకు చెందిన వ్యక్తులు, నాయకుల మధ్య తీవ్ర పోటీ నెలకొనే అవకాశం మెండుగానే ఉన్నాయి. దీంతో ఆశావహులు రిజర్వేషన్ల ప్రకటన కోసం ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. కొత్తపల్లిగోరి, నిజాంపల్లి, చిన్నకోడేపాక, చెన్నాపూర్, జగ్గయ్యపేట, బాలయ్యపల్లి గ్రామాల్లో పోటీలో ఉండబోతున్న వ్యక్తులు ఆర్థికంగా బలంగా ఉంటూ, పోటీకి సిద్ధంగా ఉన్నట్లు సంకేతాలు పంపిస్తున్నారు. అలాగే దామరంచపల్లి, సుల్తాన్‌పూర్ గ్రామాల్లో ఎస్సీ రిజర్వేషన్ ప్రకటన విడుదలైతే పోటీకి ఆవర్గం నుంచి నాయకులు సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తుంది. ఆయా గ్రామాల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ నాయకులు ఎవరికీ వారే పోటీలో తాము కూడా ఉండబోతున్నామని ప్రచారం చేసుకుంటున్నారు.

మండల వివరాలు..

మండల వ్యాప్తంగా ఆరు ఎంపీటీసీ స్థానాలను ప్రభుత్వం కేటాయించింది. అందులో కొత్తపల్లిగోరి, నిజాంపల్లి, చిన్నకోడేపాక, సుల్తాన్‌పూర్, జగ్గయ్యపేట, దామరంచపల్లి ఉన్నాయి. మండల వ్యాప్తంగా పై స్థానాలకు 16 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. మండలంలో మొత్తం 16473 మంది ఓటర్లు ఉన్నారు.

యూరియా పంపిణీ సక్రమంగా చేపట్టాలి

● ఏడీఏ శ్రీపాల్


మాట్లాడుతున్న ఏడీఏ శ్రీపాల్

కాటారం: యూరియా పంపిణీ సక్రమంగా చేపట్టి అవసరమైన ప్రతి రైతుకు అందించాలని మహదేవపూర్ ఏడీఏ శ్రీపాల్ తెలిపారు. మండల కేంద్రంలోని పీఏసీఎస్ గోదాం, పలు ప్రైవేట్ ఫర్టిలైజర్ షాపులను శుక్రవారం ఏడీఏ తనిఖీ చేశారు. ఆయా దుకాణాల్లో యూరియాతో పాటు ఇతర ఎరువుల నిల్వలు, రికార్డులు పరిశీలించారు. పీఏసీఎస్‌లో యూరియా పంపిణీ ప్రక్రియను పర్యావేక్షించారు. ఎరువుల కోసం వచ్చిన రైతులకు నానో యూరియా వాడకంపై వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. నానో యూరియాతో అనేక ప్రయోజనాలు కల్గుతాయని రైతులు వినియోగించాలని సూచించారు. ఎరువుల డీలర్లు యూరియా కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయిస్తే శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏడీఏ వెంట ఏఓ పూర్ణిమ, పీఏసీఎస్ సీఈఓ ఎడ్ల సతీశ్, ఏఈఓ రాజన్న ఉన్నారు.

వేడి ఆహారం తీసుకోవాలి

● డాక్టర్ ప్రణీత్‌కుమార్

ఏటూరునాగారం: వర్షకాలంలో ప్రజలు వేడి వేడి ఆహారం తీసుకోవాలని కొండాయి వైద్య అధికారి ప్రణీత్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని దొడ్ల, కొత్తూరు గొత్తికోయగూడెంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గొత్తికోయగూడెంలో ఇంటింటా జ్వరం సర్వే చేపట్టినట్లు తెలిపారు. 32 మందికి పరీక్షలు చేసి అవసరం ఉన్న వారికి మందులు ఇచ్చామన్నారు. దోమ తెరలను విధిగా వినియోగించాలన్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. ఫ్రైడే డ్రైడే నిర్వహించి నిల్వ ఉన్న నీటిని తొలగించామన్నారు. ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఏఎన్‌ఎం సమ్మక్క, ఆశ కార్యకర్త సునిత పాల్గొన్నారు.

మార్కెట్ షెడ్లను కూల్చడం దారుణం

● మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి


కూల్చేసిన మార్కెట్ షెడ్లను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

గణపురం: మండల కేంద్రంలో వారంతపు సంత నిర్వహిస్తున్న స్థలంలో కొనుగోలుదారులు, విక్రయదారుల సౌకర్యార్థం మా ఊరి సంత పేరుతో నిర్మించిన మార్కెట్ షెడ్లను ఎలాంటి అనుమతులు లేకుండా కూల్చి వేయడం దారుణమని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. కూల్చివేసిన మార్కెట్ షెడ్లను శుక్రవారం ఆయన బీఆర్ఎస్ నాయకులతో కలసి పరిశీలించి మాట్లాడారు. మండల కేంద్రంలో 30 సంవత్సరాలకు పైగా ఇక్కడే వారంతపు సంత నిర్వహిస్తుండడంతో సుమారు రూ.15 లక్షలతో రేకులషెడ్లను, మరుగుదొడ్లను నిర్మించినట్లు తెలిపారు. వాటిని అందుబాటులోకి తీసుకురావల్సిన ప్రస్తుత ప్రభుత్వం ఎలాంటి అనుమతులు లేకుండ కూల్చివేయడం సరికాదన్నారు. కూల్చివేతలకు కారకులైన వారిపై కలెక్టర్ స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మోతె కర్ణాకర్ రెడ్డి, జిల్లా నాయకులు పాలసాని లక్ష్మీనరసింహరావు, పోరెడ్డి పూర్ణచంద్రారెడ్డి, అయిలోని రాంచంద్రారెడ్డి, పెంచాల రవీందర్, వెంకటరమణారెడ్డి ,సాంబయ్య పాల్గొన్నారు.

పరామర్శ

చిట్యాల: మండలంలోని నైన్‌పాక గ్రామానికి చెందిన కట్టికోళ్ల లక్ష్మి, అయిలు మల్లక్క, రాయరాకుల సమ్మక్క, ఒడితల గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ రాసూరి ప్రమీల, మండల కేంద్రానికి చెందిన బుర్ర రాజయ్య ఇటీవల పలు కారణాలతో అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అల్లం రవీందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ పిట్ట సురేష్‌బాబు, పీఏసీఎస్ చైర్మన్ కుంభం క్రాంతి కుమార్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి రాజేందర్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ నిమ్మగడ్డ రాంబాబు, మండల నాయకులు చిలుముల రమణాచారి, పాండ్రాల స్వామి, మేరుగు నాగేందర్, దామేర రాజు, ఐలయ్య, బుర్ర రఘు, బుజ్జన్న, తదితరులు ఉన్నారు.

మత్తు పదార్థాలను వీడాలి

ఏటూరునాగారం: మత్తు పదార్థాలను వీడాలని, మత్తులో ఉన్నా కూడా నేరమేనని జిల్లా యాంటీ నార్కోటిక్ డీఎస్పీ రమేశ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యాంటి డ్రగ్ సెల్ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాలపై అవగాహన సదస్సు నిర్వహించి పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ విద్యార్థులు మాదకద్రవ్యాల వైపు వెళ్లకూడదని, జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. అనంతరం నార్కోటిక్ సీఐ శ్రీకాంత్ మాట్లాడుతూ మత్తు పదార్థాలు వాడకం, అమ్మకం, వారికి ఆశ్రయం ఇవ్వడం నేరమన్నారు. ప్రిన్సిపాల్ రేణుక, అధ్యాపకులు వెంకటయ్య, నవీన్, జ్యోతి, ఫాతిమా, సంపత్, రమేశ్, భాస్కర్, జీవవేణి, శేకర్, భారతి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

వాజేడు: మండలంలో స్థానికంగా ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ బీజేపీ మండల అధ్యక్షుడు పెద్ది జగపతిబాబు ఆధ్వర్యంలో శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా జగపతి బాబు మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీలకు సర్పంచ్‌లు లేకపోవడంతో మండలంలోని అన్ని పంచాయతీల్లో చెత్తాచెదారం పేరుకుపోయిందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో అర్హులైన లబ్ధిదారులకు అన్యాయం జరుగుతుందని ఆరోపించారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలు 420 హామీలను వెంటనే నెరవేర్చాలన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో మాజీ మండల అధ్యక్షుడు రామ్ కిషోర్, సాగి సీతారామ రాజు, కుర్సం కృష్ణమూర్తి, యాలం సుబ్బయ్య, సంద్ర సోమరాజుతో పాటు తదితరులు ఉన్నారు.

బస్ సర్వీస్‌ను సద్వినియోగం చేసుకోవాలి

● ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు


భూపాలపల్లి రూరల్: టికెట్ తీసుకుంటున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు


రేగొండ: గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గండ్ర

భూపాలపల్లి రూరల్: /చిట్యాల/రేగొండ: ప్రజలు ఆర్టీసీ బస్సు సర్వీస్‌లను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. శుక్రవారం భూపాలపల్లి ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో భూపాలపల్లి-పరకాల వయా మొరంచపల్లి, కొత్తపల్లి (ఎస్‌ఎం), ఒడితల, గోపాలపురం, కాకర్లపల్లి, కొడవటంచ, లింగాల, రేగొండ బస్ సర్వీసును ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం బస్సులో భూపాలపల్లి బస్టాండ్ నుంచి మోరంచపల్లి, కొత్తపల్లి (ఎస్‌ఎం), ఒడితల, గోపాలపురం, కాకర్లపల్లి, కొడవటంచ వరకు సాధారణ పౌరుడిలా ప్రయాణికులతో కలిసి ప్రయాణం చేశారు. గ్రామస్తులు ఎమ్మెల్యేకు శాలువాలు కప్పి గ్రామాల్లో స్వాగతం పలికారు. అలాగే కాకర్లపల్లిలో వినాయక మండపం వద్ద నిర్వహించిన పూజా కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ప్రయాణం అనంతరం కొడవటంచలో విలేకరు సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు.. మహాలక్ష్మీ పథకం రాష్ట్రంలో విజయవంతంగా కొనసాగుతుందన్నారు. ఉదయం 6:30 గంటలకు భూపాలపల్లి బస్టాండ్ నుంచి బస్సు బయలుదేరి పరకాలకు 8 గంటలకు చేరుకుంటుందని, తిరుగుప్రయణంలో ఉదయం 8:15 గంటలకు పరకాల బస్టాండ్ నుంచి బస్సు బయలుదేరి ఉదయం 10 గంటలకు భూపాలపల్లి బస్టాండ్ కు చేరుకుంటుందన్నారు. సాయంత్రం 5:15 గంటలకు భూపాలపల్లి బస్టాండ్ నుంచి బస్సు బయలుదేరి 6:45 గంటలకు పరకాల చేరుకొని, రాత్రి 7 గంటలకు పరకాల బస్టాండ్ నుంచి బస్సు బయలుదేరిరాత్రి 8:20 గంటలకు భూపాలపల్లి బస్టాండ్‌కు చేరుకుంటుందన్నారు.

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

రేగొండ: ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. మండలంలోని కొడవటంచలో నూతన గ్రామపంచాయతీ భవనం, ఆలయ ప్రాంగణంలో కాటేజీల నిర్మాణానికి, రంగయ్యపల్లిలో పలు అభివృద్ధి పనులకు శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కోటంచలక్ష్మీ నరసింహ ఆలయాన్ని మరో యాదాద్రిగా అభివృద్ధి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయలక్ష్మీ, తహసీల్దార్ శ్వేత, ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, ఆలయ ఈఓ మహేష్, పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్వరరావు, నాయకులు సంపత్‌రావు, పున్నం రవి, పట్టెం శంకర్, గండి తిరుపతి, రవీందర్‌రెడ్డితో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో అవకాశం కల్పించాలి

భూపాలపల్లి అర్బన్: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో యువజన కాంగ్రెస్ నాయకులకు 20 శాతం సీట్లు కేటాయించి అవకాశం కల్పించాలని జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బట్టు కర్ణాకర్ కోరారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుకు వినతిపత్రాన్ని అందజేశారు. ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం కల్పించి యువతను రాజకీయంగా ఎదగనీయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు రజినీకాంత్, సాయిచరణ్, రంజిత్, కోటేశ్వర రావు, ప్రేమ్‌కుమార్, హఫీజ్ తదితరులు పాల్గొన్నారు.

గణనాథుడికి పూజలు


పూజలో పాల్గొన్న మహిళలు

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని మిత్ర గణేష్ మండలి ఆధ్వర్యంలో కిట్టి పార్టీ మహిళలు గణనాథునికి మూడె రోజు శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని కుంకుమ పూజలు నిర్వహించారు.

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో గణపతి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మూడో రోజు శుక్రవారం లక్ష్మీగణపతి కుంకుమ అర్చన పూజా కార్యక్రమాలను అర్చకులు యల్లాప్రగఢ నాగేశ్వర్ రావుశర్మ నిర్వహించారు. మహిళలు పెద్ద ఎత్తున కుంకుమ పూజలో పాల్గొని పూజలు చేశారు. అనంతరం దుర్గాదేవి అమ్మవారికి లలితాసహస్రనామాలతో అర్చనలు చేశారు. అదేవిధంగా బొడ్రాయి వినాయకుడి మండపం వద్ద అర్చకుడు రాధాకృష్ణ శర్మ మహిళలతో కుంకుమ అర్చన పూజలు చేయించారు. ఓడవాడలో భారత్‌యూత్ ఆధ్వర్యంలో గణపతి మండపం వద్ద విద్యార్థులకు యూత్ సభ్యులు శరత్, భరత్, నర్సింహరావు, అర్చకులు నోటుబుక్కులు, పెన్నులు పంపిణీ చేశారు.

అప్రమత్తంగా ఉండాలి

టేకుమట్ల: చలివాగు, మానేరుతో పాటు, చెరువుల మత్తళ్ల వద్ద మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై దాసరి సుధాకర్ అన్నారు. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు చెరువుల్లో మత్తళ్లు పోస్తూ, చలివాగు, మానేరు ఉధృతంగా ప్రవహిస్తున్నాయని మత్స్యకారులు చేపల వేటకు వెళ్లొద్దని సూచించారు.

పెరుగుతున్న గోదావరి


వాజేడు: వరదను పరిశీలిస్తున్న అధికారులు


వెంకటాపురం(కె): గోదావరి పాయలోకి చేరిన వరదనీరు

వాజేడు: ఎగువ ప్రాంతం నుంచి వరద నీరు వస్తుండడంతో గోదావరి ఉధృతంగా పెరుగుతుంది. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న నీటితో గోదావరి వరద క్రమేపీ పెరుగుతూ శుక్రవారం సాయంత్రానికి 16.640 మీటర్లకు చేరుకుంది. దీంతో మండలంలో పలు చోట్ల రహదారులు ముంపునకు గురి కావడంతో పాటు పలు గ్రామాలకు రాక పోకలు నిలిచిపోయాయి. మండల పరిధిలోని పేరూరు, కృష్ణాపురం గ్రామాల మధ్యన మోడీ కుంట వాగు ద్వారా రహదారిపైకి వరద నీరు చేరడంతో కృష్ణాపురం, కడేకల్, పద్ద గంగారం, చంద్రుపట్ల, టేకులగూడెం, టేకులగూడెం కాలనీ గ్రామాలకు పేరూరుకు రాకపోకలు నిలిచిపోయాయి. ఈ గ్రామాల ప్రజలు పేరూరుకు రావాలంటే జాతీయ రహదారిపై నుంచి చుట్టూ తిరిగి రావాల్సి వస్తుంది. అదే విధంగా మండల కేంద్రం సమీపంలో కొంగాల వాగు ద్వారా వచ్చిన గోదావరి రహదారిని ముంచింది. దీంతో వాజేడు, గుమ్మడిదొడ్డి గ్రామాల మధ్యన రాకపోకలు నిలిచిపోయాయి. కొంగాల వాగు అవతల ఉన్న సుమారు 25 గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి రావాలంటే జగన్నాథపురం మీదుగా రావాల్సి ఉంది. మండల పరిధిలోని పూసూరు, ఏడ్జర్లపల్లి గ్రామాల మధ్య ఉన్న వంతెన పైకి వరద నీరు చేరడంతో ఇక్కడ కూడా రాకపోకలు సాగడం లేదు. ఏడ్జర్లపల్లి, బొమ్మనపల్లి, ముత్తారం, కొత్తూరు గ్రామాల ప్రజలు చుట్టూ తిరిగి వెంకటాపురం(కె) మీదుగా వాజేడుకు రావాల్సిన పరిస్థితి. కోయ వీరాపురం గ్రామ సమీపంలో చాకలివాగు వద్ద గోదావరి రహదారిపైకి చేరడంతో గ్రామస్తులు చీకుపల్లి మీదుగా ప్రయాణించాల్సి వస్తుంది.

అప్రమత్తమైన అధికారులు

గోదావరి వరద ఇంకా పెరుగుతుండడంతో పాటు పలు చోట్ల రహదారులను ముంచెత్తడంతో అధికారులు అప్రమత్తం అయ్యారు. ఎంపీడీఓ శ్రీకాంత్ నాయుడు, వాజేడు, పేరూరు ఎస్సైలు జక్కుల సతీశ్, కృష్ణ ప్రసాద్ వరద పరిస్థితిని పరిశీలించారు. గ్రామ పంచాయతీ సిబ్బందిని ఎక్కడికక్కడ అప్రమత్తం చేయడంతో పాటు రహదారులపైకి వరద నీరు చేరడంతో నీటిలోకి ఎవరు వెళ్లకుండా ట్రాక్టర్లు అడ్డంగా పెట్టడమే కాకుండా కర్రలతో అడ్డుగా కట్టారు. ప్రజలకు ఎలాంటి అవసరం ఉన్నా వెంటనే సమాచారం ఇవ్వాలని అధికారులు సూచించారు.

వెంకటాపురం(కె)లో..

వెంకటాపురం(కె): మండలంలో గోదావరి వరద పెరుగుతుంది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు వరద నీరు గోదావరిలోకి చేరడంతో పాటు ఎగువ ప్రాంతాల్లో ఉన్న ప్రాజెక్టులలో నీరు నిండడంతో వరద నీరును గేట్లు లేపి కిందకు వదులుతున్నారు. దీంతో మండలంలో క్రమంగా గోదావరి వదర పెరుగుతుంది. మండల కేంద్రంలోని గోదావరి లంకల్లోకి వెళ్లే గోదావరి పాయలోకి వరద నీరు రావడంతో గోదావరి లంకల్లోకి రాకపోకలు ని లిచిపోయాయి. రైతులు గోదావరి లంకల్లోకి వ్యవసాయ పనులకు వెళ్లేందుకు వీలు లేకుండా పోయింది.

జాతీయ క్రీడా, తెలుగు భాషా దినోత్సవం


భూపాలపల్లి అర్బన్: రామ్మూర్తి, ధ్యాన్‌చంద్ చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

భూపాలపల్లి అర్బన్: తెలుగు పండితులు గిడుగు రామ్మూర్తి జయంతిని పురస్కరించుకొని తెలుగు భాషా దినోత్సవం, మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి పురస్కరించుకొని జాతీయ క్రీడా దినోత్సవాన్ని శుక్రవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ రమణరావు ఆధ్వర్యంలో గి డుగు రామ్మూర్తి, ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు పూలమా ల వేశారు. భూపాలపల్లి ఏరియాలోని సింగరేణి ఉన్నత పాఠశాలలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఝాన్సీరాణి ఆధ్వర్యంలో తెలుగుబాష దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహించారు.

కాళేశ్వరం: మహదేవపూర్ మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో గిడుగు రామ్మూర్తి జయంతి సందర్భంగా తెలుగు భాషా దినోత్సవం, మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకొని జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహించారు. ఇన్‌చార్జ్ హెచ్‌ఎం మడక మధు, తెలుగు ఉపాధ్యాయులు రజిత, ప్రసూనల, పీడీ పూర్ణిమ, ఉపాధ్యాయులు సుధారాణి, సరితదేవి, శ్రీనివాస్, వసుధ ప్రియా, వీరేశం, సమ్మయ్య, లీలరాణి, షాహేదా బేగం, దీపికా, ఆంజనేయులు, అంజాద్ పాషా విద్యార్థులు పాల్గొన్నారు.

చిట్యాల: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహించినట్లు పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు శ్రీరాం రఘుపతి తెలిపారు. మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలవేసి అతడి సేవలను స్మరించుకున్నారు. హాకీ క్రీడలలో మూడుసార్లు ఒలంపిక్‌లో స్వర్ణ పతకాలు రావడానికి కీలక పాత్ర పోషించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ సూదం సాంబమూర్తి, ఉపాధ్యాయులు రాజమౌళి, బుర్ర సదయ్య, నీలిమారెడ్డి, సుజాత, రామనారాయణ, సరళదేవి, గడ్డం శంకర్, శ్రీనివాస్, ఉస్మాన్‌అలీ, మౌనిక, బుజ్జమ్మ పాల్గొన్నారు.

మొగుళ్లపల్లి: మండలంలోని పలు పాఠశాలలో శుక్రవారం మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకొని జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పింగిలి విజయపాల్ రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు భాగ్యశ్రీ, వెంకన్న, సురేందర్, కల్యాణి, అనిల్ కుమార్, రాజు, కుమారస్వామి, ప్రవీణ్, పద్మ, లలిత, విజయభాస్కర్, శ్రీకళ, చందర్, స్పందన పాల్గొన్నారు.


మహదేవపూర్‌లో..


చిట్యాలలో..


మొగుళ్లపల్లి: విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఉపాధ్యాయులు

బాధితులకు నిత్యావసరాల పంపిణీ

మంగపేట: మండలంలోని కమలాపురం, పాదుమూరు, నర్సింహాసాగర్ గ్రామాలకు చెందిన వరద బాధితులకు బియ్యం, నిత్యావసర సరుకుల కిట్లను శుక్రవారం రాత్రి పంపిణీ చేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కమలాపురంలో ఎర్రవాగు పొంగి ప్రవహించడంతో జనావాసాల్లోకి వరద నీరు చేరడంతో పాటు ఇళ్ల గోడలు కూలి పాక్షికంగా ధ్వంసం అయిన విషయం తెలిసిందే. దీంతో మంత్రి ఆదేశాల మేరకు రిలేయబుల్ ట్రస్ట్ అనే స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కమలాపురం గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో బాధితులకు జిల్లా గ్రంథాలయ చైర్మన్ బానోతు రవిచందర్, అదనపు కలెక్టర్ చీమలపాటి మహేందర్‌జీతో కలిసి శుక్రవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రవీందర్, ఇర్సవడ్ల వెంకన్న, గుమ్మడి సోమయ్య, మైల జయరాంరెడ్డి, యానమయ్యతో పాటు తదితరులు పాల్గొన్నారు.